సాగునీరు విడుదల చేయాలి

లక్షల ఎకరాల్లోని పంటలను కాపాడాలి
వైరాలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

వైరా టౌన్, సెప్టెంబర్ 19: సాగునీరు విడుదల చేసి లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఇటీవలి అతి భారీ వర్షాల వల్ల నాగార్జున సాగర్ ఎడమ కాలువకు గండ్లు పడడంతో 18 రోజులుగా సాగునీరు తమ పంటల పొలాలకు రావడం లేదని అన్నారు. దీంతో ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టు పరిధిలో పాలేరు రిజర్వాయర్ పాత కాలువ కింది పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రైతు సంఘం నాయకులు, రైతులు కలిసి ఖమ్మం జిల్లాలోని కల్లూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేసేందుకు నిర్ణయించుకున్నారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు.. తెలంగాణ రైతు సంఘం నాయకులను ముందస్తు అరెస్టు చేసి గృహ నిర్బంధంలో ఉంచారు. దీంతో మరికొందరు రైతు సంఘం నాయకులు, రైతులు కలిసి వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్ వద్ద నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు కింద పంటలు ఎండిపోయి తీవ్రంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలేరు రిజర్వాయర్ సమీపంలో

నిరసన చేస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

నాగార్జునసాగర్ ఎడమ కాలువ గండికి సత్వరమే మరమ్మతులను చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన సాగర్ లింక్ కెనాల్ పూర్తి చేయకపోవడంతో గోదావరి జలాలు అందించే అవకాశాలు లేకుండా పోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు, రైతులు మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, పైడిపల్లి సాంబశివరావు, మాడపాటి వెంకట్, సంక్రాంతి పురుషోత్తం, పారుపల్లి శ్రీనాథ్, మల్లెంపాటి ప్రసాద్, షేక్ పాషా, చిత్తారు మురళి పాల్గొన్నారు.

పెసల కొనుగోలుకు.. 'క్యూఆర్ కోడ్' గ్రహణం

- ఖమ్మంలో నిలిచిన క్రయవిక్రయాల ప్రక్రియ
- తేమ శాతం ఉన్నా రైతులకు తప్పని తిప్పలు

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 19: 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదు..' అనే సామెతలా ఉంది ఖమ్మం ఏఎంసీలోని పెసల కొనుగోలు కేంద్రం పరిస్థితి. ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఎట్టకేలకు పెసల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు, పంట కొనుగోలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. అందులో భాగంగానే జిల్లాలో ఖమ్మం, వైరా వ్యవసాయ మార్కెట్లలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. దాదాపు పక్షం రోజుల తరువాత మీడియాలో కథనాలు రావడం, రైతు సంఘాల నుంచి ఒత్తిడి రావడంతో అధికారులు నెమ్మదిగా కొనుగోళ్లు చేపట్టారు. అయితే అనేక నిబంధనలు, తేమ శాతం నిర్ధారణకు లోబడి క్రయవిక్రయాలు చేపట్టారు. గురువారం కూడా ఉదయం రోజువారీగా డీసీఎంఎస్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది మాత్రమే ఏఎంసీ అపరాల షెడ్‌కు వచ్చిన రైతుల పంటను పరిశీలించారు. గత కొద్దిరోజుల నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో సగానికి సగం మంది రైతుల పంట 12 శాతంలోపు తేమ శాతం కనపడుతోంది. ఉదయం సిబ్బంది నిర్ధారణలో సైతం సుమారు 20 – 25 మంది రైతుల పంట 12 శాతంలోపు తేమ నిర్ధారణ జరిగింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే వారి సంతోషం సాయంత్రంలోగా ఆవిరైంది. 'పంటకు సంబంధించిన బస్తాలు, కాంటాలు, రైతుల వివరాల నమోదుకు నిత్యం రోజువారీగా మార్క్‌ఫెడ్ అధికారులు డీసీఎంఎస్ సిబ్బందికి క్యూఆర్‌కోడ్‌లను అందజేస్తుంటారు. అయితే గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంత ప్రయత్నించినా మార్క్‌ఫెడ్ అధికారులు క్యూఆర్ కోడ్ ఇవ్వలేదు. అందుకోసమే కాంటాల ప్రక్రియ నిలిపివేశాం' అని డీసీఎంఎస్ అధికారులు పేర్కొన్నారు. ఇదే విషయంపై మార్క్‌ఫెడ్ ఉమ్మడి జిల్లా మేనేజర్‌ను వివరణ కోరగా.. క్యూఆర్ కోడ్‌తో సంబంధం లేకుండానే కొనుగోలు చేయవచ్చని సమాధానమిచ్చారు. అయితే స్వయంగా మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని తొలిసారిగా సందర్శించిన డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్‌కు ఈ విషయం తెలియకుండా అటు డీసీఎంఎస్, ఇటు మార్క్‌ఫెడ్ అధికారులు జాగ్రత్త పడ్డారు. అలాగే, క్యూఆర్ కోడ్‌లు ఉంటేనే కొనుగోలు చేస్తామని గానీ, లేదంటే అవి లేకపోయినా కొనుగోలు చేస్తామని గానీ మార్కెట్ అధికారులు రైతులకు స్పష్టం చేయలేదు. దీంతో తమ పంటను ఇంకెప్పుడు కొనుగోలు చేస్తారోనను కుంటూ రైతులు ఎదురుచూస్తూ కూర్చున్నారు. తెల్లవారుజామున వచ్చిన రైతులు రాత్రి వరకూ ఎదురుచూసినా మార్క్‌ఫెడ్ అధికారులు ఒక్క గింజను కూడా కొనుగోలు చేయలేదు.

ఖమ్మం అపరాల యార్డుకు రైతులు తీసుకొచ్చిన పెసలు

కేంద్ర మంత్రులతో మంత్రి తుమ్మల సమావేశం

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 19: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం డిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడుతో తన కార్యాయలయంలో సమావేశమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఆదిలాబాద్, వరంగల్ మహబూబ్‌నగర్, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుల ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్రమంత్రిని కోరారు. అనంతరం కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. తెలంగాణలో నూతన కోకానట్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రత్యేకంగా మంత్రిని కోరారు. ఆయిల్‌ఫాం మీద 28శాతం దిగుమతి సుంకం విధించి దేశీయంగా ఆయిల్ ఫామ్‌సాగును ప్రోత్సహిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అశ్వారావుపేటలో సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. డిల్లీ పర్యటనలో భాగంగా భారత మండపంలో జరుగుతున్న ప్రపంచ ఆహార సదస్సులో పాల్గొన్నారు. అనంతరం లీలా ప్యాలెస్ హోటల్లో డెటాయిట్ ఇండియా నిర్వహించిన గ్రోత్ విత్ ఇంపాక్టు గవర్నమెంట్ సమ్మిట్‌లో పాల్గొని వికసిత్ తెలంగాణ అంశంపై ప్రసంగించారు.

కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశమైన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బోనకల్ -ఖమ్మం ట్రాఫిక్ జామ్..!

- నాగులవంచ అప్రోచ్ రోడ్డుపై దిగబడిన భారీ వాహనం
- ఉదయం 3 గంటలపాటు నిలిచిపోయిన వాహనాల రాకపోకలు
- ఇబ్బందిపడిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, వాహనదారులు

చింతకాని, సెప్టెంబర్ 19 : అప్రోచ్ రోడ్డుపై సిమెంట్ దిమ్మెలతో వెళ్తున్న భారీ లారీ ఒక్కసారిగా కూరుకుపోయింది. దీంతో దాదాపు 3 గంటలపాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ఘటన ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామ సమీపంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రైలు పట్టాల కింద అమర్చే సిమెంట్ దిమ్మెల లోడుతో బోనకల్ వైపు వెళ్తున్న లారీ నాగులవంచ సమీపంలోని అప్రోచ్ రోడ్డుపై ఒక్కసారిగా కూరుకుపోయింది. ఉదయం 8 గంటల సమయంలో లారీ దిగబడడంతో బోనకల్–ఖమ్మం వైపు వెళ్లే పలు వాహనాల రాకపోకలకు సుమారు 3 గంటలపాటు అంతరాయం ఏర్పడింది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే గ్రామస్తులు, వాహనదారులు కలిసి భారీ పొక్లెయిన్, 2 జేసీబీలను తెప్పించి వాటి సాయంతో లారీని వెనుక నుంచి పలుమార్లు నెట్టగా ట్రైర్లు రహదారిపై మరింతగా కూరుకుపోయాయి. ఎంతో శ్రమించగా 3 గంటల తర్వాత లారీ బయటకు వచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాదాపు 2 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ పాఠశాల, కళాశాలల బస్సులను అతి కష్టంమీద పునరుద్ధరించారు. నిత్యం రద్దీగా ఉండే బోనకల్–ఖమ్మం ప్రధాన రహదారిపై ఇలాంటి పరిస్థితి ఉంటే.. ఇక గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి ఏమిటని ప్రజలు గొణుక్కుంటున్నారు.

తూతూ మంత్రంగా అప్రోచ్ రోడ్డు పనులు

15 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు అప్రోచ్ రోడ్డు మొత్తం కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో ఆ రహదారిపై ఆర్‌అండ్‌బీ అధికారులు, గుత్తేదారులు కలిసి తూతూ మంత్రంగా నాణ్యత లేని మట్టిపోసి వదిలేశారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడం.. భారీ వాహనాలు కూడా ఎక్కువగా నడిచే మార్గాన్ని మరింత పటిష్ఠంగా మరమ్మతు చేయాల్సి ఉండగా.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా గుత్తేదారు పనులు చేసి చేతులు దులుపుకున్నట్లు పలువురు గ్రామస్తులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు, గుత్తేదారులు అప్రోచ్ రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు, విద్యార్థులు కోరుతున్నారు.

నాగులవంచ వద్ద దిగబడిన లారీని పొక్లెయిన్‌తో తీస్తున్న దృశ్యం

కేజీఎంసీలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

ఖమ్మం సిటీ, సెప్టెంబర్ 19: ఖమ్మం గవర్నమెంట్ కళాశాలలో ఖాళీగా ఉన్న పలు పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోపు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రాజేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ల్యాబ్ అటెండెంట్స్– 15, స్టోర్ కీపర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, స్టెనో, టైపిస్ట్, రికార్డ్ క్లర్క్, రికార్డ్ అసిస్టెంట్–7, రేడియోగ్రఫీ టెక్నీషియన్ (ఆర్టీ)–3, రేడియోగ్రఫీ టెక్నీషియన్ (ఈసీజీ)– 2, రేడియోగ్రఫీ టెక్నీషియన్ (సిటీ స్కాన్)–3, అనస్తీషియా టెక్నీషియన్ –4, ధోబీ, ప్యాకర్స్–4, ఎలక్ట్రీషియన్ –2, ప్లంబర్–1, డ్రైవర్ హెవీ వెహికిల్–1, థియేటర్ అసిస్టెంట్–4, గ్యాస్ ఆపరేటర్–2, వార్డుబాయ్–4 కలిపి మొత్తం 52 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. విద్యార్హతలు, నిబంధనలు కళాశాల వెబ్‌సైట్ www.gmc khammam a.gov, జిల్లా వెబ్‌సైట్ https: khammam. telangana,gov.inలో పొందుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్డీవోను కలిసిన 'అమరావతి-నాగ్‌పూర్' హైవే బాధితులు

రఘునాథపాలెం, సెప్టెంబర్ 19: నాగ్‌పూర్–అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా ప్లాట్లు కోల్పోతున్న నిరుపేదలు గురువారం ఖమ్మం ఆర్డీవోను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. 2007లో నాటి ప్రభుత్వం రఘునాథపాలెం రెవెన్యూలో నగరంలోని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిందని, ప్రస్తుతం హైవే నిర్మాణంలో కొంతమంది ప్లాట్లు కోల్పోతున్నట్లు తెలిపారు. నష్టపోతున్న బాధితులకు పరిహారంతో పాటు పక్కనే తిరిగి స్థలాలు కేటాయించాలని కోరారు. ఆర్డీవోను కలిసిన వారిలో బాధితులు వాణీశ్రీ, పద్మావతి, భవాని, కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

మార్కెట్ల బలోపేతమే ధ్యేయంగా పనిచేయాలి

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 19: వ్యవసాయ మార్కెట్ల బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ సూచించారు. మార్కెటింగ్‌శాఖ ఉప సంచాలకురాలు పద్మావతితో కలిసి గురువారం ఖమ్మంలో పర్యటించిన ఆయన.. తొలుత ఇటీవల గుండెపోటుతో మరణించిన ఖమ్మం ఏఎంసీ అసిస్టెంట్ సెక్రటరీ వజీరుద్దీన్ కుటుంబాన్ని పరామర్శించారు. వజీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అతడి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సాయంత్రం ఖమ్మం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కార్యాలయంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని వ్యవసాయ మార్కెట్ల సెక్రటరీలతో సమావేశమయ్యారు. మరికొద్ది రోజుల్లో మార్కెట్లకు పత్తి పంట వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మార్కెట్ల ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని, బకాయిలను త్వరగా వసూలు చేయాలని ఆదేశించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల మార్కెటింగ్ శాఖ అధికారులు అలీం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్

ఎఫ్ఎస్ఎన్ఎల్‌ను అమ్మేసిన కేంద్రం

రూ.320 కోట్లకు జపాన్ సంస్థకు విక్రయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: కేంద్ర సర్కార్ మరో ప్రభుత్వరంగ సంస్థను అమ్మేసింది. వాటాల విక్రయంలో భాగంగా ఫెర్రో స్క్రాప్ నిగం లిమిటెడ్(ఎఫ్ఎస్ఎన్ఎల్)ని జపాన్‌కు చెందిన కోనాయికీ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్‌కు రూ.320 కోట్లకు విక్రయించింది. స్టీల్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్..ఎంఎస్‌టీసీ లిమిటెడ్‌కు చెందిన 100 శాతం సబ్సిడరీ సంస్థ. ఈ ఎఫ్ఎస్ఎన్ఎల్ విక్రయానికి కేంద్రం గతంలోనే నిర్వహించిన బిడ్డింగ్ ప్రక్రియకు రెండు బిడ్డింగ్‌లు టెక్నికల్‌గా అర్హత సాధించాయి. వీటిలో జపాన్‌కు చెందిన కోనాయికీ అత్యధికంగా రూ.320 కోట్ల బిడ్డింగ్ దాఖలుకు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, హెచ్‌డీ కుమార స్వామి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిజర్వు ధర రూ.262 కోట్లుకాగా, బిడ్డింగ్ రూ.320 కోట్లు దాఖలవడంతో దీనికి మొగ్గుచూపింది కేంద్రం. మరో బిడ్ ఇండిక్ జియో రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్(చందన్ స్టీల్ లిమిటెడ్‌కు చెందిన సబ్సిడరీ సంస్థ) దాఖలు చేసినట్లు తెలిపింది. టోక్యో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టైన కోనాయిక్ ట్రాన్స్‌పోర్ట్ కో లిమిటెడ్. సంస్థకు స్టీల్ రంగంలో 140 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. 1979 నుంచి ఎఫ్ఎస్ఎన్ఎల్ స్టీల్ మిల్ సేవలను అందిస్తున్నది. పలు స్టీల్ ప్లాంట్ల నుంచి సేకరించిన స్క్రాప్ స్టీల్‌ను తిరిగి వినిమయంలో తెస్తున్నది సంస్థ.

హైదరాబాద్‌లో అల్ట్రావయలెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన మోటార్‌సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయలెట్... తాజాగా రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో తన తొలి షోరూంను గురువారం ప్రారంభించింది. దీంతో సంస్థకు ఇది ఐదో షోరూం కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, కో–ఫౌండర్ నారాయణ్ సుబ్రమణియమ్ మాట్లాడుతూ.. వ్యాపార విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అడుగుపెట్టినట్లు, ఈ ఏడాది చివరినాటికి మొత్తం అవుటిలెట్ల సంఖ్యను పదికి పెంచుకోబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అధిక మైలేజీని కోరుకుంటున్నవారిని దృష్టిలో పెట్టుకొని తొలి మాడల్ ఎఫ్77ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ బైకు సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నదన్నారు. దీంట్లో 7.1 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.2.99 లక్షలుగాను. 10.1 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ రూ.3.99 లక్షలుగా నిర్ణయించింది. మరోవైపు, శుక్రవారం సంస్థ గంటకు 265 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఎఫ్99ని స్పోర్ట్స్ బైకును ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. వచ్చే 2–3మూడేండ్లలో మరో 3–4 మాడళ్లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన... ఈ బైకులపై ఎనిమిదేండ్లు లేదా 8 లక్షల కిలోమీటర్ల వ్యారెంటీ కల్పిస్తున్నది.

సేల్స్‌ఫోర్స్ విస్తరణ

శాన్ ఫ్రాన్సిస్కో, సెప్టెంబర్ 19: కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ సేల్స్‌ఫోర్స్..భారత్‌లో తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. హైదరాబాద్‌తోపాటు బెంగళూరులలో ఉన్న సెంటర్లను ఆధునీకరించడానికి మరిన్ని పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ అధికారి బ్రియాన్ మిల్హమ్ తెలిపారు. మరోవైపు, కంపెనీ దేశీయ హెడ్ అరుంధతీ భట్టాచార్య మాట్లాడుతూ..భారత్‌లో ఉద్యోగుల సంఖ్యను గడిచిన రెండేండ్లలో రెండింతలు పెంచినట్లు, ప్రస్తుతం 13 వేల మంది విధులు నిర్వహిస్తున్నారని, మరింత మందిని తీసుకునే అవకాశాలున్నట్లు చెప్పారు.

హెరిటేజ్ ఐస్‌క్రీం ప్లాంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్..తాజాగా తెలంగాణలో ఐస్‌క్రీం ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. షామీర్‌పేట్‌లో రూ.204 కోట్ల పెట్టుబడితో నెలకొల్పబోతున్నట్లు తెలిపింది. ఈ ప్లాంట్ ఏర్పాటునకు సంబంధించి కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశమై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగు రాష్ట్రాల్లో ఐస్‌క్రీంకు పెరుగుతున్న గిరాకీని దృష్టిలో పెట్టుకొని ఈ యూనిట్‌ను నెలకొల్పాలని నిర్ణయించినట్లు, వచ్చే ఏడాది నవంబర్ నాటికి ఈ యూనిట్ అందుబాటులోకి రానున్నట్లు కంపెనీ వర్గాల వెల్లడించాయి.

వాణిజ్య



టప్పర్‌వేర్ దివాలా

ఆర్థిక సంక్షోభంలో ప్లాస్టిక్ కిచెన్‌వేర్ దిగ్గజం • అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు
తగ్గిన గిరాకీ, పెరిగిన పోటీతో కుదేలు • రూ.10వేల కోట్ల రుణ భారం

న్యూయార్క్, సెప్టెంబర్ 19: ప్రముఖ ప్లాస్టిక్ కిచెన్‌వేర్ బ్రాండ్ టప్పర్‌వేర్ దివాలా తీసింది. అమెరికా బ్యాంకర్‌ప్సీ కోర్టులో చాప్టర్ 11 బ్యాంకర్‌ప్సీ రక్షణను కోరుతూ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆహార పదార్థాల నిల్వలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఈ సంస్థ.. ప్రస్తుత మార్కెట్‌లో నెలకొన్న పోటీని తట్టుకోలేక చతికిలపడింది. పర్యావరణ పరిరక్షణపై పెరిగిన అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై మారుతున్న కస్టమర్ల అభిప్రాయాలు సైతం టప్పర్‌వేర్ అమ్మకాలకు గండి కొట్టాయి.

80 ఏండ్ల కిందట..

అమెరికాలోని ఫ్లోరిడాలోగల ఓర్లాండో ప్రధాన కేంద్రంగా 1942లో టప్పర్‌వేర్ బ్రాండ్‌ను ఎర్ల్ టప్పర్ స్థాపించారు. 1946లో మార్కెట్‌కు వీటి ఉత్పత్తులు పరిచయమయ్యాయి. అప్పట్నుంచి టప్పర్‌వేర్ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూ వచ్చింది. కానీ మార్కెట్‌లో పెరిగిన పోటీతో అమ్మకాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభమైంది. క్లీనెక్స్, టెఫ్లాన్, ఇతర బ్రాండ్ల దూకుడు ముందు టప్పర్‌వేర్ నిలదొక్కుకోలేకపోయింది. ఇక డైరెక్ట్ సేల్స్ నుంచి వినియోగదారులు దూరం జరుగడం కూడా సంస్థ వ్యాపారాన్ని దెబ్బతీసిందని దివాలా పిటిషన్‌లో టప్పర్‌వేర్ పేర్కొన్నది.

పీకల్లోతు అప్పులు

దివాలా పిటిషన్ ప్రకారం టప్పర్‌వేర్‌పై రూ.10,000 కోట్ల (1.2 బిలియన్ డాలర్లు) రుణ భారం ఉన్నది. రుణదాతలతో చేసుకున్న ఒప్పందాలనూ ఇది మీరినట్టు తెలుస్తున్నది. అయితే సుమారు రూ.5,700 కోట్ల (679.5 మిలియన్ డాలర్ల) ఆస్తులు కూడా ఉన్నట్టు కంపెనీ చెప్తున్నది. ఇక ప్రస్తుతం సంస్థ ఉద్యోగుల సంఖ్య 5,500. భారత్‌తోపాటు 41 దేశాల్లో వీరంతా పనిచేస్తున్నారు. 4.65 లక్షల కన్సల్టెంట్లూ ఉన్నారు. ఫ్రీలాన్స్ బేసిస్‌లో దాదాపు 70 దేశాల్లో టప్పర్‌వేర్ ఉత్పత్తులను అమ్ముతున్నారు.

భారత్‌లో యథాతథంగానే..

అమెరికా దివాలా కోర్టులో పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. భారత్‌లో టప్పర్‌వేర్ అమ్మకాలు యథాతథంగానే సాగుతాయని సంబంధిత వర్గాల నుంచి అందుతున్న సమాచారం. దేశీయంగానే టప్పర్‌వేర్ ఉత్పత్తుల తయారీ జరుగుతున్నది కాబట్టి.. అంతర్జాతీయ మార్కెట్‌లో తలెత్తిన ఇబ్బందులు ఇక్కడ ప్రభావం చూపబోవని వారంటున్నారు. అంతేగాక మునుపటిలాగే విస్తరణ ఉంటుందని, కస్టమర్ల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తెస్తామని చెప్తున్నారు. ఇప్పటికే గ్లాస్, స్టీల్ ఉత్పత్తులనూ టప్పర్‌వేర్ బ్రాండ్ అమ్ముతున్న విషయం తెలిసిందే.

'దివాలా ప్రక్రియ అంటే సంస్థ మనుగడకు కావాల్సిన వెసులుబాట్లను కల్పించడమే. ఈ కంపెనీ ఎక్కడికీ పోదు. ఎప్పట్లాగే ఇకపైనా మా నాణ్యమైన ఉత్పత్తులు మార్కెట్‌లో లభిస్తాయి'

-లారీ అన్ గోల్డ్‌మన్, టప్పర్‌వేర్ అధ్యక్షుడు, సీఈవో

దేశానికే ఆదర్శంగా స్కిల్ వర్సిటీ

- కంపెనీలు, పారిశ్రామికవేత్తలు భాగస్వాములవ్వాలి: సీఎం రేవంత్
- దసరా తర్వాత కోర్సులు ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు ఈ యూనివర్సిటీలో భాగస్వాములవ్వాలని, యువతకు నైపుణ్యాలను పెంచి.. వారికి ఉపాధి కల్పించేందుకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బోర్డుతోపాటు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, కంపెనీల ప్రతినిధులతో గురువారం సచివాలయంలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం తరపున 150 ఎకరాల స్థలంతోపాటు రూ.100 కోట్లు కేటాయించామన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు యూనివర్సిటీ నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు, భవనాల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. బోర్డు చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా యూనివర్సిటీకి బ్రాండ్ ఇమేజీని తీసుకువస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. అలాగే ఇకపై తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారిస్తుందన్నారు. దాదాపు 200 ఎకరాల్లో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పి.. 2028 ఒలింపిక్స్‌లో దేశానికి గోల్డ్ మెడల్ తీసుకురావాలనే లక్ష్యంతో క్రీడాకారులకు శిక్షణను అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించే గమ్యస్థానంగా తెలంగాణ నిలబడుతుందనడంలో సందేహం లేదన్నారు. కాగా, దసరా తర్వాత కోర్సులను ప్రారంభించనున్నట్టు బోర్డు సూచనప్రాయంగా వెల్లడించింది. తొలి ఏడాది 2వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, బోర్డు కో చైర్మన్ శ్రీని రాజు, సభ్యులు దేవయ్య, సుచిత్రా ఎల్లా, సతీష్ రెడ్డి, సీఎ